క్లుప్తంగా

కామవరపుకోట తహసీల్దార్‌గా ఎలీషా



తహసీల్దార్ జి.ఎలీషా

కామవరపుకోట: కామవరపుకోట మండల తహసీల్దార్‌గా జి.ఎలీషా సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో కోనసీమ జిల్లా కొత్తపేట మండలంలో తహసీల్దార్‌గా పనిచేశారు. ఎన్నికల అనంతరం సాధారణ బదిలీల్లో భాగంగా, ఆయన ఇక్కడికి ఇచ్చారు. ఈ సందర్భంగా కామవరపుకోట సర్పంచ్ కరిపోతు అనూష భాగ్యరాజ్, కార్యదర్శి జీడీ శ్రీనివాసరావు, మండల రెవెన్యూ సిబ్బంది ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ద్వారకాతిరుమల తహసీల్దార్‌గా సుబ్బారావు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల తహసీల్దార్‌గా జేవీ సుబ్బారావును నియమిస్తూ జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఆయన భీమడోలు, ఆ తరువాత టి.నరసాపురం మండలాల్లో తహసీల్దార్‌గా పనిచేశారు. ప్రస్తుతం ద్వారకాతిరుమలకు బదిలీపై వచ్చారు. అలాగే ఇప్పటివరకు ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన జి.రవికాంత్ మచిలీపట్నంకు బదిలీ అయ్యారు.

వ్యాసరచన పోటీలు

జంగారెడ్డిగూడెం: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేలా మానవత కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు మానవత జంగారెడ్డిగూడెం అధ్యక్షుడు అయినాల రమణమూర్తి పేర్కొన్నారు. పట్టణంలోని బాలుర హైస్కూల్‌లో సోమవారం మానవసేవే మాధవ సేవ అనే అంశంపై విద్యార్థులకు వ్యాసచన పోటీలు నిర్వహించారు. ఈ విధంగా మండలంలోని ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్‌లో పోటీలు నిర్వహించనున్నట్లు రమణమూర్తి తెలిపారు. విజేతలకు ప్రత్యేక రోజుల్లో బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ్‌ప్రకాష్, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, జిల్లా కన్వీనర్ త్రిపుర రమేష్, పెనుమర్తి సురేష్‌బాబు, కాసగాని సత్యనారాయణ, రామకృష్ణ, దల్లి కేదారేశ్వరరెడ్డి, బేతా రమేష్ పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యపై వివరాల సేకరణ



రామకృష్ణ కుటుంబసభ్యుల నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేస్తున్న అధికారులు

పోలవరం రూరల్: పోలరం మండలం గూటాల గ్రామానికి చెందిన కౌలు రైతు పలకంశెట్టి రామకృష్ణ ఆత్మహత్యకు గల కారణాలపై సహాయ వ్యవసాయ సంచాలకులు పీజీ బుజ్జిబాబు, మండల వ్యవసాయ శాఖ అధికారి కె.రాంబాబు సోమవారం వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ 9 ఎకరాల భూమిని రామకృష్ణ కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నట్లు తెలిపారు. గత నాలుగైదు సంవత్సరాలుగా పండించిన పంటల వివరాలను, రుణాల వివరాలు కూడా సేకరించినట్లు చెప్పారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయాన్ని అందించేలా ఏర్పాటు చేస్తామని తెలిపారు.

వరద బాధితులకు సహాయం



వరద బాధితులకు సహాయం అందిస్తున్న దృశ్యం

వేలేరుపాడు: వరద బాధతులకు సోమవారం కీర్తన ఫిన్‌సెర్వ్ ప్రైవేట్ లిమిటెడ్ సభ్యులు సహాయం అందించారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు చేతుల మీదుగా 152 కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి 52 కేజీల బియ్యం, రెండు కేజీల కందిపప్పు, రెండు లీటర్ల మంచి నూనె ప్యాకెట్లు, పాలు పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని అశ్వారావుపేటకు చెందిన కీర్తన సంస్థ ఎండీ జి.పద్మజరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు గణేసుల ఆదినారాయణ, దేవిరెడ్డి, సుధాకర్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

మీకోసంకు 12 అర్జీలు

జంగారెడ్డిగూడెం: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమానికి 12 దరఖాస్తులు వచ్చినట్లు ఆర్డీవో అద్దయ్య తెలిపారు. కొయ్యలగూడెం మండలం బోడిగూడానికి చెందిన జె.నాగమణి, అంకాలగూడానికి చెందిన కె.అబ్బులు, మరికొందరు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, పొజిషన్ సర్టిఫికెట్, బోరు సర్టిఫికెట్ల వీఆర్వో డబ్బులు డిమాండ్ చేశారని ఫిర్యాదు చేశారు. బుట్టాయగూడెం మండలం బండార్లగూడానికి చెందిన పైదా అక్కమ్మ, మరికొందరు పోలీస్ రక్షణ కోసం, కేఆర్‌పురానికి చెందిన పాపోలు చినబాబు ఆర్ఎస్ నెంబర్ 65లో ఉన్న 7.60 ఎకరాల భూమికి ఎఫ్ఎంబీ ప్రకారం సరిహద్దులు నిర్ణయించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. శ్రీనివాసపురానికి చెందిన టి.సర్వేశ్వరరావు మరికొందరు పామాయిల్ వ్యర్థాలు గృహాల సమీపంలో వదులుతున్నారని ఫిర్యాదు చేశారు. జంగారెడ్డిగూడెంకు చెందిన దండమూడి ప్రసాద్ మార్కండేపురంలో ఉన్న 17.01 ఎకరాలు భూమికి రక్షణ కల్పించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

తల్లిపాలు.. అమృతపు జల్లు



జంగారెడ్డిగూడెం: ఉప్పలమెట్ట అంగన్‌వాడీ కేంద్రం నుంచి 2కే రన్ నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: తల్లిపాలు అమృతపు జల్లు వంటివని ఐసీడీఎస్ సీడీపీవో బ్యూలా అన్నారు. జంగారెడ్డిగూడెం ఉప్పలమెట్ట అంగన్‌వాడీ కేంద్రంలో 5వ రోజు సోమవారం తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యూలా మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంట లోపే ముర్రిపాలు పట్టించాలన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 2 సంవత్సరాల వరకు తల్లిపాలు పట్టాలన్నారు. 2024వ సంవత్సరాన్ని అంతరాలు పూరించి, తల్లిపాల సంస్కృతిని ప్రోత్సహిద్దాం అనే అంశంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల విశిష్టతను వివరించారు. తల్లిపాలే బిడ్డలకు శ్రేష్ఠం అని తెలియజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మోహన్, ఆర్ఎంవో వైద్యులు రాంబాబు, సూపర్‌వైజర్ లక్ష్మి, హెచ్‌వీ కృష్ణకుమారి, ఏఎన్ఎం మంగ, ఎంఎస్‌కే ఎస్తేరు రాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా 2కే అవగాహన ర్యాలీ నిర్వహించారు.

అమ్మపాలెంలో..

జంగారెడ్డిగూడెం రూరల్: అమ్మపాలెం అంగన్‌వాడీ కేంద్రం వద్ద సోమవారం తల్లిపాల వారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులకు సీమంతాలు జరిపి బాలింతలకు పసుపు, కుంకుమ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.విజయలక్ష్మి తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ముర్రిపాలు పట్టించడం వల్ల బిడ్డలకు వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈనెల 7వ తేదీ వరకు ప్రాజెక్టు పరిధిలోని అన్ని కేంద్రాల్లో తల్లి పాల వారోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ప్రధానోపాధ్యాయురాలు టి. ఝాన్సీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం: బిడ్డ పుట్టిన వెంటనే ముర్రిపాలు తాగించడం వలన బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని బుట్టాయగూడెం ఐసీడీఎస్ సీడీపీఓ ఈ.తులసి అన్నారు. కేఆర్‌పురంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ బిడ్డకు పాలివ్వడం వల్ల తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ముర్రిపాలలో తగిన పోషకాలు, విటమిన్లు, ఖనిజ లవణాలు ఉంటాయని అవి శిశువుకు రోగ నిరోధక శక్తిని పెంచుతాయని అన్నారు. అలాగే శిశువుకు పాలు పట్టించే విధానాన్ని ఆమె తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎస్‌వీ సత్యవతి, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతం

కొయ్యలగూడెం: తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా సోమవారం రేపల్లెవాడ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఐసీడీఎస్ శాఖ సూపర్‌వైజర్ ఎ.నయోమీ రాణి ఆధ్వర్యంలో బాలింతలకు పసుపు, కుంకుమ, గర్భిణులకు సీమంతం నిర్వహించి కానుకలు అందజేశారు. బిడ్డకు తల్లిపాలు పట్టించడం వల్ల పసితనం నుంచి 80 శాతానికి పైగా రోగ నిరోధక శక్తి కలిగి ఉంటారని, దీనివల్ల తల్లికి కూడా ఆరోగ్యపరంగా మేలు అని అన్నారు. ముఖ్యంగా రొమ్ము కేన్సర్‌కు సంబంధించిన వ్యాధులకు తల్లులు దూరంగా ఉంటారని తెలిపారు. ఇటీవల కాలంలో రొమ్ము కేన్సర్ల వ్యాధులు పెరగడానికి గల కారణం తమ బిడ్డలకు తల్లులు పాలు ఇవ్వకపోవడమే అని శాస్త్రవేత్తలు శాస్త్రీయంగా నిరూపించారని తెలిపారు. బ్రెస్ట్ మిల్క్ బెస్ట్ మిల్క్ అంటూ గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కె.కృష్ణవేణి, కె.శ్రీలత పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెం రూరల్: అమ్మపాలెంలో తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి



బుట్టాయగూడెం: కేఆర్‌పురంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంపై వివరిస్తున్న సీడీపీఓ తులసి



కొయ్యలగూడెం: రేపల్లెవాడ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు నిర్వహిస్తున్న సీమంతం

వయనాడ్ బాధితుల సహాయార్థం విరాళాల సేకరణ

టి.నరసాపురం: వయనాడ్ కొండచరియలు విరిగిపడిన ఘోర దుర్ఘటనలోని బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి భారతీయుడిపై ఉందని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం టి.నరసాపురంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. సంఘ జిల్లా కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ వయనాడ్ దుర్ఘటనలో 200మంది వరకు మృత్యువాత పడగా, అనేక గ్రామాలు నేలమట్టమయ్యాయన్నారు. చాలా మంది ప్రజలు సర్వస్వం కోల్పోయి నిరాశ్రయులుగా మిగిలారన్నారు. దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో అనుమోలు మురళి, కుమారి, సీత, ముత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

విధమ్మ ఆలయ అభివృద్ధికి సహకరించాలి



ఆలయంలో రజక సంఘం సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: శ్రీ విధమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలని కొయ్యలగూడెం రజక సంఘం సోమవారం కోరింది. కన్నాపురం రోడ్డులోని కంకర కోనేరు (రజకుల చెరువు) గట్టుపై ఉన్న అమ్మవారి ఆలయం వద్ద సోమవారం కొయ్యలగూడెం మండల రజక సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ వందల ఏళ్ల చరిత్ర కలిగిన విధమ్మ అమ్మవారి ఆలయ విస్తీర్ణం పెంచి నూతనంగా నిర్మించాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. దీనివల్ల తహసీల్దార్ కార్యాలయ రోడ్డు విస్తరణతో పాటు కంకర కోనేరు చెరువు అభివృద్ధికి ఉపయోగపడుతుందని అన్నారు. అదేవిధంగా రోటరీ క్లబ్ వారికి చెరువుగట్టు నలుమూలల వాకర్స్ ట్రాక్ నిర్మాణానికి స్వచ్ఛందంగా చెరువును తాము అప్పగించడం జరిగిందని, ఈ నేపథ్యంలో నిరాశ్రయులవుతున్న సుమారు ఇరవై కుటుంబాల వారికి ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు నిర్మించాలని సమావేశం ఈ సందర్భంగా కోరింది. ఈ కార్యక్రమంలో జడ్డపల్లి రాంబాబు, జుత్తిగ శివ, బోనగిరి ప్రసాద్, బూరుగుపల్లి రామకృష్ణ, కడకట్ల అన్నవరం, బురుగుపల్లి పోసి, జనపల్లి రాంబాబు, గుంపుల వెంకటేశు, గుంపుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఈఈకి సత్కారం



ఈఈ రాధాకృష్ణను సత్కరిస్తున్న ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు

జంగారెడ్డిగూడెం: వరద ముంపు ప్రాంతాల్లో విద్యుత్‌ను పునరుద్ధరించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకున్న జంగారెడ్డిగూడెం విద్యుత్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాధాకృష్ణను సోమవారం ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల పెద్దవాగు ప్రాజెక్టు గట్టు తెగి పోవడంతో వరద ఉధృతికి డివిజన్ పరిధిలోని కుక్కునూరు, వేలేరుపాడు ప్రాంతాల్లో పలు గ్రామాల్లో కరెంట్ లైన్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, ఈ నేపథ్యంలో విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించేందుకు ఈఈ విశేషంగా కృషిచేశారన్నారు. అలాగే ఇటీవల జరిగిన పదోన్నతులలో కూడా పారదర్శకంగా పోస్టింగ్ ఆర్డర్లు ఇవ్వడం, ఉద్యోగ కార్మికులతో స్నేహపూర్వకంగా వ్యవహరించి విద్యుత్ ఉద్యోగులు, వినియోగదారుల మన్నలు పొందిన ఈఈ రాధాకృష్ణకు యూనియన్ డివిజన్ కార్యవర్గం ప్రత్యేకంగా అభినందనలు తెలుపుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి సీహెచ్ రాజు, అధ్యక్షుడు వీఈ సుబ్రహ్మణ్యం, డి.నాగరాజు, అజయ్, విజయ్ భాస్కర్, కిరణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్

పోలవరం రూరల్: పాఠశాలల్లో చదివే బాలికల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు వారి యోగక్షేమాలు తెలుసుకోవాలని పోలవరం ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ అన్నారు. పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలికలకు, వారి తల్లితండ్రులకు సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మైనర్ బాలికలపై అత్యాచారాలు జరుగుతున్న దృష్ట్యా పిల్లలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత తల్లితండ్రులు తీసుకోవాలన్నారు. పిల్లల ప్రవర్తన, మానసిక స్థితిగతులను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టే విషయంపై ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలన్నారు. పిల్లలు పాఠశాలలకు వెళ్లి, తిరిగి వస్తున్నారా, ఏ విధంగా పరిస్థితులు ఉన్నాయి, ఈవ్ టీజింగ్ ఏమైనా జరుగుతుందా అనే విషయాలపై ఉపాధ్యాయులు కూడా దృష్టి కేంద్రీకరించాలన్నారు.

సాయిబాబాకు విప్రసేవక్ పురస్కారం



చిలుకూరి సాయిబాబా దంపతులను సన్మానించిన దృశ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ప్రాంతీయ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చిలుకూరి సాయిబాబా విప్రసేవక్ బిరుదును అందుకున్నారు. ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య మహాసభలో బ్రాహ్మణ సమాజానికి అందిస్తున్న సేవలకు గాను ఆయనకు ఈ పురస్కారం అందించి సత్కరించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్రాహ్మణ సంఘానికి చీఫ్ అసోసియేట్ సెక్రటరీగా సాయిబాబాను సమాఖ్య నియమించినట్లు ప్రాంతీయ బ్రాహ్మణ సంఘం సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం జంగారెడ్డిగూడెంలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో సాయిబాబా దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో సమయమంత్రి రాధాకృష్ణమూర్తి, కూచి త్రినాధరావు, గన్నవరపు మాధవరావు, మదనం బేడు సుబ్బారావు దంపతులు, చిలుకూరి లక్ష్మీనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

అడవుల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ



కొమ్ముగూడెం అడవుల్లో విత్తనాలు చల్లుతున్న బంజారా బజరంగీ భేరి కమిటీ సభ్యులు

చింతలపూడి: చింతలపూడి మండలం కొమ్ముగూడెం అడవుల్లో బంజారా బజరంగీ భేరి కమిటీ ఆధ్వర్యంలో వేప, నేరేడు, జీడి, మామిడి, పనస, కుంకుడు, సీతాఫలం మొదలగు విత్తనాలు చల్లారు. జిల్లా నాయకులు ధరావత్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ అడవులు జీవ వైవిధ్య నిలయాలు మాత్రమే కాకుండా మానవ అవసరాలను తీరుస్తూ, పర్యావరణాన్ని కాపాడే భూరక్షకులు అని అన్నారు. పర్యావరణ కాలుష్యం, గ్లోబల్ వార్మింగ్ లాంటి సమస్యలకు పరిష్కార మార్గం అడవులను పెంచడమే అని అన్నారు. గ్రామ కమిటీ గౌరవ అధ్యక్షుడు ధరావత్ కాంతారావు నాయక్ మాట్లాడుతూ ఒకప్పుడు దట్టమైన అటవీప్రాంతంగా విరాజిల్లిన చింతలపూడి మండలంలో ప్రస్తుతం అడవులు వేగంగా అంతరించి పోతున్నాయన్నారు. వీటిని కాపాడుకోడానికి లక్ష విత్తనాలు చల్లే కార్యక్రమం పెట్టుకుని పంతంగులగూడెం అడవుల్లో విత్తనాలు చల్లినట్లు తెలిపారు. సంఘ కోశాధికారి హసావత్ శివ నాయక్ మాట్లాడుతూ అడవులు అంతరించిపోతే మానవాళి మనుగడకే ప్రమాదమని అన్నారు. అందుకని అడవులను కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరి పైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ధరావత్ రమేష్, భాస్కర్ నాయక్, హంక్యా నాయక్, రాజేష్, చంద్రబాబు, హసావత్ వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి వైద్యపరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సహాయకులు

పోలవరం రూరల్: పోలవరం మండలం ఇటికిలకోట గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు సోమవారం కంటి పరీక్షలు నిర్వహించారు. నేత్ర వైద్యాధికారి ఎన్‌జీఎస్ శ్రీనివాస్ పాఠశాలలోని 110 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. ఇందులో ఏడుగురికి కళ్లజోళ్లు అవసరం అని గుర్తించారు. వారికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేస్తామన్నారు. నవంబర్ నెలాఖరు వరకు మండలంలోని ప్రతి పాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం కంటి సంరక్షణకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోషకాహారమైన ఆకు కూరలు ఎక్కువ తీసుకోవడం వల్ల కంటి సమస్యలు కొంత వరకు మెరుగుపడవచ్చన్నారు. జిల్లా అంధత్వ నివారణ సమితి ఆధ్వర్యంలో ఈక్యాంపు నిర్వహించినట్లు శ్రీనివాస్ తెలిపారు.

మైక్‌సెట్ కొనుగోలు నిమిత్తం..

కామవరపుకోట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మైక్‌సెట్ కొనుగోలు నిమిత్తం దాతలు నగదు అందజేశారు. తమ్మిశెట్టి ఫణిదీప్, లక్ష్మయ్య, స్థానిక మెడికల్ షాపు యజమాని శ్రీమంత్ కలసి రూ.16 వేలు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.గస్‌బాబుకు సోమవారం అందించారు. ఈ సందర్భంగా సొసైటీ మాజీ కార్యదర్శి తమ్మిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు మైక్‌సెట్ కొనుగోలుకు ఈ నగదును అందజేసినట్లు చెప్పారు. ఉపాధ్యాయులు కూసం రమేష్, డి.రాజు, వీరమల్ల మధు, తమ్మిశెట్టి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులంటే అంత చులకనా..!



ముడిచర్లలో విద్యార్థులను ఎక్కించుకోకుండా వెళ్లిపోతున్న ఆర్టీసీ బస్సు

లింగపాలెం: ఆర్టీసీ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా దూర ప్రాంతాల్లో పాఠశాలకు వెళ్లి చదువుకుంటున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని ఆశన్నగూడెం, వేములపల్లి, ముడిచర్ల గ్రామానికి చెందిన విద్యార్థులు రంగాపురం హైస్కూల్‌లో విద్యనభ్యసిస్తున్నారు. అయితే వీరికి రంగాపురం హైస్కూల్‌కు వెళ్లేందుకు బస్సులు లేదా ఆటోల్లో ప్రయాణించాల్సిన పరిస్థితి. ఉదయం పాఠశాలకు వెళ్లే సమయంలో ఆయా గ్రామాల్లో ఆర్టీసీ బస్సులు ఆపకుండా వెళ్లిపోతున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మరో బస్ కోసం వేచి చూస్తే పాఠశాలకు ఆలస్యమైపోతుందని చేసేదిలేక ఆటోల్లో ప్రయాణం సాగించాల్సిన వస్తుందని, ఇందుకు అదనపు ఖర్చు అవుతుందని వాపోతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి పాఠశాలకు వెళ్లి, వచ్చే సమయాల్లో విద్యార్థుల కోసం తప్పనిసరిగా బస్‌స్టాప్‌లలో బస్‌లను ఆపేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వారణాసిలో అదృశ్యమైన కోటయ్య ఆచూకీ లభ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: వారణాసిలో అదృశ్యమైన పుట్లగట్లగూడెం గ్రామానికి చెందిన బాదరాల కోటయ్య ఆచూకీ లభ్యమైంది. ఈనెల 1వ తేదీన పుట్లగట్లగూడెం నుంచి 40 మంది కాశీ యాత్రకు వెళ్లారు. యాత్రకు వెళ్లిన బాదరాల కోటయ్య ఈనెల 3వ తేదీన వారణాసిలో అదృశ్యమయ్యారు. సోమవారం సాయంత్రం వారణాసికి 40 కిలోమీటర్ల దూరంలో సంధోలి గ్రామంలో కోటయ్య ఉన్నట్లు సమాచారం తెలిసిందని యాత్రకు వెళ్లిన కొలూరి కృష్ణ తెలిపారు. కోటయ్య తమ వద్ద క్షేమంగా ఉన్నాడని ఇంటికి తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక పోలీసుల సహకారంతో కోటయ్య ఆచూకీ కనుగొన్నామని కృష్ణ తెలిపారు.

కొయ్యలగూడెం తహసీల్దార్‌గా చెల్లన్నదొర



తహసీల్దార్ కె చెల్లన్నదొర

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం తహసీల్దార్‌గా కె.చెల్లన్నదొర నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు విడుదలైనట్లు ఆయన సోమవారం తెలిపారు. గతంలో బుట్టాయిగూడెం, వేలేరుపాడు తహసీల్దార్‌గా పనిచేసిన ఆయన అనంతరం ఏలూరు, కాకినాడ కలెక్టరేట్ కార్యాలయాల్లో విధులు నిర్వహించారు. త్వరలో కొయ్యలగూడెంలో బాధ్యతలను స్వీకరిస్తానని ఆయన పేర్కొన్నారు.

పోలవరం ప్రాజెక్టు పరిశీలన



పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న రామచంద్రయాదవ్

పోలవరం రూరల్: రాష్ట్రం ఆర్థికంగా అభివృద్ధి సాధించాలంటే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని భారత చైతన్య యువజన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బి.రామచంద్రయాదవ్ అన్నారు. ఆయన పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను సోమవారం పరిశీలించారు. ప్రాజెక్టు వ్యూ పాయింట్, కాఫర్‌డ్యామ్, స్పిల్‌వే ప్రాంతాలను పరిశీలించారు. ప్రాజెక్టు నమూనాను కూడా పరిశీలించి ప్రాజెక్టు పరిస్థితులపై ఈఈ వెంకటరమణను అడిగి తెలుసుకున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకోవాలన్నారు.

వ్యక్తి ఆత్మహత్యపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: వ్యక్తి ఆత్మహత్య ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జ్యోతిబాస్ తెలిపారు. పట్టణంలోని అయ్యప్పటౌన్‌షిప్‌లోని 2వ రోడ్డులో ఆదివారం అపస్మారక స్థితిలో పడి ఉన్న టి.నరసాపురం మండలం బొర్రంపాలెంకు చెందిన కలపర్తి వెంకటేశ్వరరావును స్థానికులు గుర్తించి 108కు సమాచారం ఇచ్చారు. అతడిని స్థానిక ఏరియా ఆసుపత్రికి 108లో తీసుకువెళ్లగా పరీక్షించిన వైద్యులు పురుగుమందు సేవించాడని, అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. ఆసుపత్రికి వచ్చిన వెంకటేశ్వరరావు భార్య అన్నపూర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

టి.నరసాపురం: రోడ్డు ప్రమాద ఘటనకు సంబంధించి నిర్లక్ష్యంగా వాహనం నడిపిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై డి.దుర్గామహేశ్వరరావు తెలిపారు. ఈనెల 2వ తేదీ రాత్రి షేక్ ఇమాం సాహెబ్ మిత్రులతో కలిసి టి.నరసాపురం రోడ్డుపై వెళుతున్నాడు. ఈ క్రమంలో ఒక వ్యక్తి వాహనంపై వేగంగా వస్తూ ఢీకొనడంతో ఇమాం సాహెబ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఏలూరులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా, అక్కడ ఆయన చికిత్స పొందుతున్నాడు. ఇమాం ఫిర్యాదు మేరకు ద్విచక్రవాహనదారుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.